క్లుప్తంగా

విద్యార్థులను కుందూ నది దాటించిన సిబ్బంది

చాపాడు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. క్రమంలో మండలంలోని అన్నవరం సమీపంలోని మదూరు గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులు గురువారం హైస్కూల్‌కు వెళ్లారు. కుందూ నది వంతెనపై నీటి ప్రవాహం పెరుగుతుండటంతో దీనిని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, జెడ్పీ హైస్కూల్ సిబ్బందితో మాట్లాడి విద్యార్థులను మధ్యాహ్నానికి ఇంటికి పంపించారు. నది వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సచివాలయ సిబ్బంది నది దాటించి క్షేమంగా ఇంటికి పంపించారు. కుందూ నదిలో 20వేల క్యూసెక్కులకుపైగా నీరు ప్రవహిస్తుండటంతో నది వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా తహసీల్దార్ రమాకుమారి వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను నది వద్ద ఉంచారు.

నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను గురువారం స్థానిక ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షులుగా డాక్టర్ వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ సురేష్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను వైద్యులు అభినందించారు.

యూరియా కోసం అవస్థలు

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె, అయ్యవారిపల్లె రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం యూరియా పంపిణీ చేపట్టారు. రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తుండటంతో చెప్పులను రైతులు క్యూలో పెట్టారు. వ్యవసాయ అధికారులు చెప్పులను తొలగించాలని రైతులకు ఆదేశించారు. దీంతో రైతులే గంటల తరబడి క్యూలో నిలబడి యూరియా తీసుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. అయ్యవారిపల్లె రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్టీయు భవన్ వద్ద ఉపాధ్యాయుల సమస్యల పట్ల, విద్యారంగం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్టీయూ నాయకులు చంద్రహాసరెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, వెంకటరామయ్య, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ డేవిడ్ రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పీజీలో హిస్టరీ సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుకు బయోడేటా, అర్హత పత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8688191034 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మధుబాబు తెలిపారు. పట్టణంలోని స్వరాజ్ నగర్‌లో ఉన్న బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థినులకు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వాహిదా బాను, సీఓ నాగజ్యోతి, జయలక్ష్మమ్మ, అరుణ, రామలక్ష్మి, రామాంజనేయమ్మ పాల్గొన్నారు.

వైద్య సేవలు

ప్రొద్దుటూరు : తమ గ్రామంలో వైద్య సేవలు నిర్వహించడం హర్షణీయమని దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మునివర, ఉపసర్పంచ్ మార్తల లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దొరసానిపల్లెలోని జెడ్పీ హైస్కూల్‌లో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ప్రారంభించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి, సత్యప్రవీణ్, వెంకటరాముడు, జీపీ సంధ్యారాణి, బొలిశెట్టి శ్రీలక్ష్మి ప్రజలకు వైద్య సేవలు అందించారు. మాకం సురేష్ వైద్య శిబిరానికి వచ్చిన వారికి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు గాజులపల్లె రామచంద్రుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పోరుమామిళ్ల : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. వనసంరక్షణ – మన రక్షణలో భాగంగా గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరితసైన్యం, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ పాల్గొన్నారు.



అగ్నిమాపక కేంద్రం వద్ద నిలిచిన వర్షపు నీరు



ఉప ఖజానా కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయం వద్ద..



పొంగిపొర్లుతున్న మదురు వంక

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలో గురువారం వేకువజాము నుంచి ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా 120.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా పట్టణంలోని ప్రధాన వీధులతోపాటు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ద్విచక్రవాహనాల్లో సైతం వెళ్లడానికి వీలు లేకుండా ఉదయం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాత బస్టాండ్, శివాలయం సర్కిల్, మైదుకూరు రోడ్డు, గాంధీ రోడ్డులలో ఇదే పరిస్థితి కనిపించింది. భారీ వర్షం పడిన ప్రతి సందర్భంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలో రెవెన్యూ, సబ్ ట్రెజరీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, అగ్నిమాపక కార్యాలయం, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం, ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం వెళ్లేందుకు ఉద్యోగులు మోకాలు లోతు నీటిలో నడవాల్సి వచ్చింది.



వెంగళాయపల్లె మడువంక వద్ద వర్షం నీటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

నీట మునిగిన పంట పొలాలు

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరులో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. గ్రామీణ ప్రాంతంలో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. అక్కడక్కడ పంటలు నీట మునిగాయి. రేగుళ్లపల్లె గ్రామంలో 85 ఎకరాల్లో వేరుశన పంట వర్షం ధాటికి దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. కానపల్లె, చౌడూరు, శంకరాపురం, కామనూరు, చెన్నమరాజుపల్లె, నాగాయపల్లె, నంగనూరుపల్లె గ్రామాల పరిధిలో సాగైన వరి పంట నీట మునిగింది. లోతట్టు గ్రామాలైన కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని అమృతానగర్, ప్రకాష్‌నగర్, గోపవరం గ్రామ పంచాయతీలోని యానాది కాలనీ, సోములవారిపల్లె గ్రామ పంచాయతీలోని పెన్నానగర్, ఈశ్వర్‌రెడ్డినగర్‌లలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మదూరు కాలువ వంక పొంగిపొర్లింది.

పొలాలు జలమయం

రాజుపాళెం : మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో మండల కేంద్రమైన రాజుపాళెం ఎస్సీ కాలనీలో జల దిగ్బంధమైంది. గ్రామంలోని నాలుగు కాలనీల్లో దాదాపు నాలుగైదు అడుగుల మేర లోతు నీళ్లు పారుతుండటంతో కాలనీలోని వారంతా ఆందోళన చెందుతున్నారు. కొంత మంది ఇళ్లలోకి నీరు పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీటితో పాటు పొలాల్లో నీరంతా ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలోని రాజుపాళెం – వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో, రాజుపాళెం – అయ్యవారిపల్లె గ్రామాల మధ్యలో ఉన్న మడువంక వద్ద ఉన్న లోలెవెల్ కాజ్‌వేపై వర్షం నీరు మూడు అడుగుల మేర ఉధృతంగా ప్రవహించింది. ఆదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. ఎస్‌ఐ కత్తి వెంకటరమణ వరద నీటిని పరిశీలించి, నీటిలో ఎవరూ దిగకుండా చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పత్తి, మినుము, జొన్న, పెసర, పసుపు, వేరుశనగ, సోయాబీన్ పంటలు పూర్తిగా నీట మునిగాయి. అందులో ఉన్న నీటిని తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండల వ్యాప్తంగా 83.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



నీట మునిగిన వరి పంట



రాజుపాళెం ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో నిలిచిన వర్షం నీరు



రాజుపాళెంలో ఇంట్లోకి నీరు వచ్చిందని అంటున్న మహిళ

అక్రమాలపై విచారణ వేగవంతం చేయాలి

బద్వేలు అర్బన్ : ఆర్సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టుల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ వేగవంతం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. గురువారం స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఆర్సీఎం ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ చేపట్టిన 24 మంది ఉపాధ్యాయ నియామకాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల జీవోలను, విద్యాశాఖ ప్రొసీడింగ్స్, హైకోర్టు ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘించారని అన్నారు. విద్యార్థులు లేని, మూసివేసిన పాఠశాలలకు పోస్టులను కేటాయించడం, రోస్టర్ పాయింట్లను తారుమారు చేయడం, తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా ఎంపికలు చేయించడం వంటి ఘటనలపై విచారణ చేయడంతో పాటు సంబంధిత విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో అందరికీ ఆరోగ్యం

మైదుకూరు : పెరటి తోటల పెంపకంతో ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండవచ్చని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. దువ్వూరు మండలం సంగటితిమ్మాయపల్లెలో గురువారం పెరటి తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వివిధ రకాలైన కూరగాయలను, ఆకుకూరలను ఇంటి పెరట్లో క్రిమి సంహారక మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో పెంచుకోవచ్చని తెలిపారు. మహిళలకు పెరటి తోటల పెంపకానికి కావాల్సిన విత్తనాల కిట్లను అందించారు. పశుపోషణకు కావాల్సిన బైపాస్ ఫ్యాట్ తదితర ఉత్పత్తులను లబ్ధిదారులకు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని కృష్ణాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారీ సశక్త్ పరివార్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం అనేక రకాల వైద్య పరీక్షలను, క్యాన్సర్ ముందస్తు పరీక్షలను చేయిస్తోందన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. స్టాళ్లను ఏర్పాటు చసి పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆయేషా, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

మైదుకూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎస్టీయూ మైదుకూరు రీజియన్ నాయకులు డిమాండ్ చేశారు. మైదుకూరులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట గురువారం ఎస్టీయూ మైదుకూరు రీజియన్ (మైదుకూరు, దువ్వూరు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ పథకాలను అమలు చేయాలేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లకు పైగా బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉందన్నారు. డీఎస్సీ –2025 ద్వారా అన్ని ఖాళీలు భర్తీ చేసి బదిలీ పొందిన ఉపాధ్యాయుడికి రిలీవర్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వంలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గమని సీపీఐ ఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేసేందుకే వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలను నిర్మిస్తే వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు సర్కారు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఉన్న కొత్త మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించి పేద విద్యార్థుల డాక్టర్ కలను సాకారం చేయాలని, లేని పక్షంలో విద్యార్థి, యువజన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. . సమావేశంలో అఖిల భారత విద్యార్థి అసోసియేషన్ జిల్లా నాయకులు బి.అనిల్, ఏరియా నాయకులు శంకర్, చరణ్, బన్నీ, యువజన సంఘం నాయకులు శివరాం, రవి, కార్మిక సంఘం నాయకులు నారాయణ, చంద్రపాల్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నాయబ్ రసూల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మైదుకూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే విధంగా 2022 పీఆర్సీ అరియర్స్‌ను కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 20న కడపలోని విద్యుత్ భవనం ఎదుట కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, డిస్కమ్ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ బలం

కాశినాయన : మహిళల ఆరోగ్యమే కుటుంబ బలమని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పుష్ప అన్నారు. గురువారం మండలంలోని వరికుంట్ల వీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ రెండో తేదే వరకు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, పీహెచ్ ఎన్ శారద, హెచ్‌ఎస్ హుసేనమ్మ, చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : మహిళల ఆరోగ్యమే లక్ష్యమని డిప్యూటీ ఆరోగ్య వైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని టేకూరుపేటలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. గర్భిణీలు, బాలింతల పర్యవేక్షణ, కౌమార బాలికల రక్తహీనత పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహార ప్రాముఖ్యలతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ వ్యాధుల నిపుణులు అఖిల, చిన్న పిల్లల వైద్య నిపుణులు శివవర్ధన్‌రెడ్డి, దంత వైద్యుడు సునీల్‌కుమార్‌రెడ్డి, వైద్యులు మేరి ఎల్సా, శ్రీవిద్య, జయరాం, కృష్ణదేవరాయలు, సూపర్‌వైజర్లు నిర్మలమ్మ, రఘురామ్, ఆరోగ్యమిత్ర శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయం భవనం

టీడీపీ కుటిల రాజకీయం

సీపీ బ్రౌన్ గ్రంథాలయం అదనపు కట్టడాల నిర్మాణాల విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు కాంట్రాక్టర్ సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయినా.. కార్మికులు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటూ స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా అవేమీ టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నించినందుకు వైఎస్‌ఆర్‌సీపీ డివిజన్ ఇన్‌ఛార్జ్‌పై పోలీసులచేత అక్రమంగా కేసు బనాయించారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి రూ. 6.66 కోట్ల నిధులను వైఎస్ జగన్ సర్కార్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. వైఎస్‌ఆర్‌సీపీ అభివృద్ధికి పాటుపడుతుంటే జీర్ణించుకోలేని కడప టీడీపీ నేతలు కుటిల రాజకీయం చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ గ్రంథాలయం అభివృద్ధికి గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం అదనపు భవనాల నిర్మాణం సాగుతోంది. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. కడప టీడీపీ నేతలు నగరంలోని 21 డివిజన్ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్‌పై అక్రమంగా కేసును బనాయించి తమ అధికార బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రూ. 6.66 కోట్ల నిధులు మంజూరు..

సీపీ బ్రౌన్ గ్రంథాలయం విస్తరణ చేయాలని దివంగత జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు, గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్‌తో పాటు, అనేకమంది నాయకులు, అధికారులు, వైవీయూ అధికారులు వైఎస్ జగన్ సీఎంగా ఉండగా విన్నవించారు. ఆయన గ్రంథాలయ అభివృద్ధికి అదనపు భవనాల నిర్మాణానికి రూ. 6.66 కోట్లు నిధులను మంజూరు చేశారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయం ప్రాంతం విస్తరింపచేసేందుకు వెనుక భాగాన 0.27 సెంట్లు స్థలాన్ని రూ. 3 కోట్లతో సేకరణ చేశారు. భవన నిర్మాణాల అభివృద్ధి కోసం మరో రూ.3.66 నిధులను మంజూరు చేశారు. ఇందుకోసం వైఎస్ జగన్ తాను సీఎంగా వున్న సమయంలో సీపీ బ్రౌన్ గ్రంథాలయంను పరిశీలించి, ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ శిలాఫలకాన్ని దాచేశారు. ఈ విషయాన్ని స్థానికంగా 21వ డివిజన్‌కు సంబంధించిన వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు టీడీపీ నేతల పర్యటన సమయంలో ప్రశ్నించారు. దీంతో అతనిపై అక్కసును పెంచుకున్న టీడీపీ నేతలు సమయం కోసం ఎదురుచూశారు. కాగా ప్రస్తుతం స్థానికంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భవననిర్మాణ పనులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేయిస్తున్నారు. ఆయన ఈ భవన నిర్మాణ పనులను వేగవంతంగా చేసేందుకు నిర్మాణాల సమీపంలో షెడ్డును కార్మికుల కోసం ఏర్పాటు చేయించారు. దాదాపు 30 మంది కార్మికులు, తమ పిల్లలు, ఆడవాళ్లతో సహా అక్కడే నివాసం వుంటున్నారు. అంతేగాక స్థానిక బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలను తీర్చుకోవడం, స్నానాలను చేయడం వలన తీవ్రస్థాయిలో అపరిశుభ్రత నెలకొంది. భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి వసతులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి కల్పించకపోవడం వలనే ఈ విధంగా కార్మికులు వ్యవహరిస్తున్నారని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు స్థానిక కార్పొరేటర్ మోతుకూరు సుజాత, ప్రజలతో కలిసి వినతిపత్రం కూడా అందచేశారు. ఈ వ్యవహారంను పక్కదోవ పట్టించేలా కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేత రెండు రోజుల క్రితం టీడీపీ నేతలు 21వ డివిజన్ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు తమను రూ. 6 లక్షలను డిమాండ్ చేశారనీ, ఆ డబ్బులను ఇవ్వనందుకు స్థానిక ప్రజలను రెచ్చగొట్టి అనవసరమైన ఆరోపణలను చేయించి కడప వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు కూడా టీడీపీ నేతల సూచనల మేరకు సుబ్బరాయుడుపై అక్రమంగా కేసును ఆగమేఘాలమీద బనాయించేశారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

పోరుమామిళ్ల : పట్టణంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం వారు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా చెక్ చేయాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు చెన్నయ్య, కేశవ, సఫా, పీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

అట్లూరు : కడప– బద్వేలు రహదారిలో సిద్ధవటం అటవీ ప్రాంతంలో ఇటీవల కూలిపోయిన బ్రిడ్జిని నిర్మించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బ్రిడ్జి కూలిన ప్రాంతాన్ని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి కూలిపోయిందన్నారు. రెండు నెలలైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ రహదారిలో కడప నుంచి బద్వేలు, కలసపాడు, గిద్దలూరు, నెల్లూరు, విజయవాడకు, అటు బద్వేలు నుంచి కడప, తిరుపతికి అధిక సంఖ్యలో రాకపోకలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పడిగ వెంకటరమణ, బ్రహ్మయ్య, శీను, విబిరం ప్రసాద్, కొరియన్ ప్రసాద్, రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ' జయప్రదం చేయండి

– దేవసాని ఆదిత్యారెడ్డి

పోరుమామిళ్ల : విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ శ్రేణులు జయప్రదం చేయాలని రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యరంగంలో ఎక్కువ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 8,500 కోట్లతో 17 మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిల్లో 5 కాలేజీలు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనే చంద్రబాబు నిర్ణయం వ్యతిరేకిస్తున్నామన్నామని చెప్పారు. వైఎస్ జగన్ మొదలు పెట్టిన మెడికల్ కాలేజీలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్, మీడియా చైర్మన్‌గా సురేష్



ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది సీవీ సురేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్, మీడియా చైర్మన్‌గా మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ నియమించారు. ఈ సందర్భంగా గురువారం సీవీ సురేష్ మాట్లాడుతూ తనను మహాసభ లీగల్ సెల్, మీడియా చైర్మన్‌గా నియమించినందుకు మహాసభ గౌరవాధ్యక్షులు టీజీ వెంకటేష్, అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ఇల్లూరు లక్ష్మయ్య, సిటీ కేబుల్ మహేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి, విజయవాడలో సొంత భవన నిర్మాణానికి, సంఘీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

పద్య పఠనంలో మైదుకూరు విద్యార్థినికి ప్రథమ బహుమతి



తెలుగు తల్లి వేషధారణలో పోటీలో పాల్గొన్న గౌరి

మైదుకూరు : దేశ భక్తి అంశంపై మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల సొసైటీ ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పద్య పఠన పోటీల్లో మైదుకూరు మండలం వనిపెంట గురుకుల పాఠశాల విద్యార్థిని వీరమల్ల గౌరి ప్రథమ బహుమతి సాధించింది. గురుకుల పాఠశాలల సొసైటీ కొద్ది రజుల కిందట తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గౌరి మొదటి స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో మూడు భాషల్లో నిర్వహించిన పద్య పఠన పోటీల్లో విద్యార్థిని గౌరి తెలుగు తల్లి వేషధారణలో దేశభక్తి పద్యాలను తెలుగులో వినిపించిందని ప్రిన్సిపాల్ వివరించారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

మైదుకూరు : ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి స్థానిక అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ నాయకులు తెలిపారు. గురువారం అమ్మవారిశాలలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ నాయకులు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి 3వ తేదీ వరకు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న విజయదశమి సందర్భంగా అమ్మవారి శమీ దర్శనం, రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామని, ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని కోరారు.